నిరీక్షణ

# అరుణా షడింయులు

మణి

ఒకటి... రెండు... గడియారం మోగుతోంది. సుందర్రావ్ గబగబా రాస్తున్నాడు. టంగ్... టంగ్... తొందరగా... మరీ తొందరగా... ఆరు, ఏడు, గడియారం కొడుతోంది. సుందర్రావ్ పేనా పాళీ చిట్లిపోయి చిటచిట అంటోంది.

తొమ్మిది.

కిటికీవేపుకు పరుగెత్తి కమ్ముల సందుల్లోంచి అవతలకి తొంగి చూచాడు. నిశ్శబ్దం. దూరాన తొమ్మిదేళ్ళ అమ్మాయి "రమ్మనవె కోకిలా..." అంటో కూనిరాగం తీస్తో పూలు గిల్లుతోంది. దగ్గిరగా చిక్కుడు ఆకుమీద ఓగ్గొంగళిపురుగు సర్కస్ ఫీట్ చేస్తోంది. ఆకు అంచున పాకుతో, తటాలున జారి కిందపడి, లేచి ఒళ్లు విదలించి, మళ్లీ చెట్టు పైకి ఎగబాకేందుకు సన్నద్ధమైంది.

గడియారం చూచాడు సుందర్రావ్. తొమ్మిదీ పదిహేను అయింది. దీర్ఘంగా నిశ్వసిస్తో తోటంతా కలయ చూచాడు, బరువుగా కిటికీ కమ్ముల కానుకొని.

అరుణ కనిపించలేదు.

రాసి పూర్తిచేసిన జాబు బయటకుదీశాడు.

"ఆ మధ్య ఓఉత్తరం రాశావు. మళ్లీ ఇంతదాకా రెండక్షరాలు గీకి ఇటు పారెయ్యలేదు. నీకీలోపల నేను మూడు జాబులు రాశాను. కాని నువ్వొక్కదానికూడా జవాబు రాయలేదు. ఇదే విషంగా మా రెవెన్యూ ఇన్స్పెక్టరు చేస్తే ఈ పాటికి ఛార్జెస్ ఫ్రేమ్‌చేసి ఉండేవాణ్ణి..."

గేటు దగ్గిరగా గాజుల చప్పుడైంది. మట్టిగాజుల మోతలు కోకిలకూజితాలై సుందర్రావ్ హృదయంలో సరాగాలు పాడినయ్. ఆశాపూర్వకంగా చూచాడు అటువేపు. అరుణ మూర్తి లీలగా గోచరించింది అతనికి. సంతోషం పెల్లుబికింది. అతనిముఖం విప్పారి చాటైంది. టైం చూచాడు. తొమ్మిదీ యిరవై అయిదు.

జాబు చదవటం నిలిపి మడిచి చేత పట్టుకున్నాడు. ఒడంబడిక ప్రకారం సుందర్రావ్ జాబురాసి ఆమెకిచూపి అక్కడ ఆ గోడ వెనక వేస్తే ఆమె వచ్చి తీసుకుంటుంది. అంచేత ఆమె తనవేపు ఎప్పుడు తిరుగుతుందా ఎప్పుడామెకి చూపటమా అని ఆత్రుతతో చూస్తోన్నాడు క్షణమొక యుగంగా భావిస్తో. ఆ లీలా విగ్రహం వెనక్కి తిరగలేదు. సరిగా కనిపించనూ లేదు. ఏమంటే సుందర్రావుకి నిండుగా అల్లుకున్న చిక్కుడు పందిరి అడ్డుగా ఉంది. నిక్కి చూచాడు అతను. ఊహుఁ, లాభంలేదు.

ఆ విగ్రహం మాయమైంది అక్కడనుంచి. గాజుల సవ్వడికూడా వినిపించడంలేదు.

సుందర్రావ్‌కి అనుమానం వేసింది. అక్కడికామె నిజంగా వచ్చిందా? తాను కల కనలేదుగదా! ఏమో? తానింతకు పూర్వం చూచింది అరుణ కాదూ? అయితే ఇప్పుడేదీ? బహుశా అక్కడెవరితోనో మాటాడుతోంటుంది.

సుందర్రావ్ పాము చెవులకి అక్కడ అలికిడేమీ గోచరించలేదు.

అవును. అతను కలగన్నాడు. అతనికసలు మొదటినుంచీ అనుమానమే తానొక కలలు కనే మనిషినని. శాస్త్రుల్లు అతన్ని "సోమ్నాంబులిస్ట్" అనేవాడు. మత్తుగా అదోవిధంగా ఉంటాడతను. లోకం మరోమాదిరిగా అగుపడుతుంది. అందరికీ యిలాగే వింతగా అగుపడుతుంది కదూ?

జగమంతా పోగై ఎక్కడికో పోతోన్నట్టు, తనుమాత్రం అల్లాగే మైలురాయి మాదిరి— నిలుచున్నవాడు నిలుచున్న పళంగా ఉన్నట్టు, అతనికి తోస్తోంది.

ఎక్కడికో ఈ ప్రస్థానం? నిరంతరంగా, నిర్విరామంగా సాగే ఈ పయనం- ఎక్కడికో! వీళ్ళకి- ఈ పిచ్చిప్రజకి విసుగు- అలుపు ఏమీ లేవుగా మోసు!

ఏడుగంటలకల్లా అదిగో - ఇదే వీథిని, నొసట, అదే విభూతిరేఖల్తో పరమశివుడిమాదిరి సాక్షాత్కరిస్తాడు సంచితో మంగలిరంగడు. తొమ్మిదిముక్కాలు కల్లా సరిగ్గా- ఆ కళ్ళద్దాల హెడ్ మిస్ట్రెస్, మొహానికడ్డంగా గొడుగు పట్టుకొని- ఎండైనా, వానైనా పిడుగులు రాలినా, ఆ గొడుగలా ఉండాల్సిందే!- హాజరౌతుంది. ఆ...వాళ్ళ అమ్మాయి నిరుడీరోజుల్లో పమిట పావడ కట్టుకొని పుస్తకాలు హుషారుగా ఊపుకుంటూ దిక్కులు చూస్తూ బడికి వెళ్ళేది. ఇప్పుడు ఈవిడనిచూస్తే? ఆ గొడుగు- ఆ సన్న నాజూకు వాచీ, ఆ చెప్పులజోడూ, ఆ కళ్ళద్దాలు- ఎవ్వరనుకుంటారు ఆమే ఈమె అని? ఎంతగా- ఎంత తొరగా మారింది!

అసలు వెధవ భూగోళం సెకండుకి 18 మైళ్ళ వేగంతో గమిస్తుందిట! భూగోళం ఒకటేమిటి, విశ్వమే సబ్బుబుడగ స్థలంలో తిరుగుతుందని అన్నాడు ఐన్‌స్టీన్ పండితుడు. కాని తాను మాత్రం పట్టువిడిచితే ఎక్కడ పడిపోతానో అన్నట్టు ఉన్నరీతిగానే ఉన్నాడు. మార్పు అంటూ ఏమీలేదు. తిన్న అన్నమే తినటం- పోయిన ఆఫీసుకే పోవటం! రాసిన ఫైళ్ళే రాస్తాడు. ఇచ్చినవాడికే రిమైండరు. ఒక్కడూ రిప్లయి ఇవ్వడు. అసలు, తనంటే లోకం కిందుచూపు చూట్టంలేదు కదా! కాకుంటే ఈ అరుణకి ఏం వచ్చింది? ఎందుకు జవాబు రాయకూడదు? తానంతగా ప్రాధేయపడి రాసినా ఆమెకెందుకంట యింత బింకం! పోనీ, తనేమైనా "అన్యథా శరణంనాస్తి మాంరక్ష" అంటూ తనకై తానే ఆమెని శరణనలేదే! తనకి జాబు రాయడంలో మొదటి ఉత్సాహం అంతా ఆమెదే... ఇల్లాచేస్తే తనకి చేరుతుంది అని ఉపాయం కూడా చెప్పింది. అల్లాంటి ఈ అరుణ...

ఎవరో వస్తున్నారు. అరుణలా ఉంది. వెధవ చిక్కుడుచెట్టొకటి. రామాయణంలో పిడికలవేట! అక్షణప్రభ కదలింది అక్కడి నుంచి. సరీగా చూచాడు సుందర్రావ్. ఎక్కువగా ఊదిన బెలూన్ పగిలినట్టుగా అతని ఉత్సాహం క్షణంలో చచ్చిపోయింది. ఇంతకూ ఆ ఆశాసుందరి అరుణ కాదు. పక్కవీథిలో ఉండే సుబ్బరత్నం. అవును, ఆ పిచ్చిపిల్లే.

జోబీలోంచి చేతిగుడ్డ తీసి కళ్ళూ మొఖమూ తుడుచుకున్నాడు. ఎర్రగా నెత్తురోడుస్తున్నాయి అతని కళ్ళు. ఎదురుగా రెండు దాసాని పువ్వులు విచ్చి గాలికి ఊగుతున్నయ్.

మడిచిన జాబు మళ్ళీ విప్పాడు.

"...వచ్చే సంవత్సరం ఎక్కడ చేర్తావు మరి? ఎక్కడ చేరేది రాస్తానన్నావే గాని రాయలేదు. నేనుకూడా వచ్చే సంవత్సరం ఇక్కడ ఉండను. పోయి ఎం. ఏ. లోనో "లా"లోనో చేర్దామనుకుంటున్నాను. ఈ వెధవ ఉద్యోగం ఎలాగూ మనకి గిట్టుబాటు కాదు. ఆరు నెలలకే తల ప్రాణం తోకకి వచ్చింది."

నిజంగా తల ప్రాణం తోకకి వచ్చింది సుందర్రావ్ కి. ఇహ చదవలేకపోయ్యాడు. ధ్యానమంతా ఆమె రాకమీద లగ్నమై వుంది. అల్లాంటి మనస్సును కళ్లెంవేసి బిగించి, గాడిలో వేసి, తనే రాసిన జాబు చదివించటం అతనికి అసాధ్యమైంది. తలెత్తి చూచాడు కిటికీలోంచి. జారిపడిన గొంగళి పురుగు మళ్ళీ అదే కొమ్మ వేపుకు ఎగబాకుతోందిఒళ్లంతా విరుచుకుంటూ. అందుబాటులో అన్ని ఆకులుంటే ఎందుకో ఈ పిచ్చి గొంగళి పురుగు అదే ఆకుకోసం అర్రులు చాచడం!

గేటుదగ్గర సన్నగా మాటలు వినిపిస్తున్నయ్.

కళ్లు పెద్దవిచేసి, చెవులు నిక్కించిచూశాడు సుందర్రావ్. ఒక డజన్ దాకా అమ్మాయిలు వచ్చారు నవ్వుతూ, ప్రేలుతూ. తమాయించుకొని ఒక్కొక్కరినీ పరిశీలించి చూచాడు, అందులో ఏమైనా అరుణ కలిసిపోయిందేమో అని. అయితే యేం లాభం? అందులో ఆమె లేదు.

వచ్చి కుర్చీలో కూలబడ్డాడు. కళ్లూ చెవులూ, నోరులోంచి ఆవిరి వస్తోంది. గుండె దడదడ లాడుతోంది. చేతులు టేబిల్ మీద చాచి బోరగిలపడ్డాడు. కుర్చీ, టేబిల్ పక్క-

నున్న నేల, ఇల్లు, కిటికీలు అన్నీ సెకండుకి వెయ్యి మైళ్ళ వేగంతో పరిభ్రమిస్తున్నయ్. కళ్లు గట్టిగా మూసుకొని టేబిల్ కేసి గుండెల్ని అదిమి పండుకున్నాడు.

సన్నగా మూలిగాడు అతను. ఎండాకాలంలో ఎక్కడా నీళ్లుదొరక్క, అలసి చెట్టు కింద పడుకొని సొరగలు కక్కే బిక్కచిక్కిన కుక్కగొంతులో గొరగొరలాడింది ఆ మూలుగు. అతనికి ఒక్కసారిగా బిగ్గరగా ఏడవాలనిపించింది. తలెత్తి చూచాడు, చుట్టూ ఎవరేనా ఉన్నారేమో అని. ఒక్కసారిగా లోకాన్నే మరచిపోయిన సుందర్రావుకి తటాలున తన వయస్సు గుర్తుకొచ్చింది. చిన్న పిల్లలైతే ఊరికినే ఏడవ్వొచ్చు. తను-తనలాంటి వాళ్లు-ఏడిస్తే ఎవరన్నా ఏమనుకుంటారు? చిన్న పిల్లలెంత అదృష్టవంతులు! ఇష్టంవచ్చినప్పుడు, కావలసినంతసేపు ఏడవ్వొచ్చు. వెధవ జన్మ, బాల్యం దాటితే, ఏడిచేందుకుకూడా వీలులేదు. మరీ లోకంలో బతకటమే భారంగా ఉంది. స్వాతంత్ర్యం చచ్చిపోయింది. నిజంగా స్వాతంత్ర్యమే ఉంటే? సుందర్రావ్ కళ్లు దీనంగా కిటికీ కమ్మలవేపు చూచాయి.

ఆకు అడుగువేపు ప్రయాణం కట్టిన గొంగళి పురుగు మళ్ళీ పట్టుతప్పి కిందపడింది.

ఆకుల సందుల్లోంచి రెండు మేకకళ్లు తన వేపుగా చూస్తున్నయ్. తటాలునలేచి కిటికీ వేపుకు పరుగెత్తాడు. ఒక విగ్రహం గబగబా దాసాని చెట్టుదగ్గరకు వెళ్లి సుందర్రావు కళ్ళకి దీటై మెరుస్తోన్న దాసానిపూజంటమీదికి చేతులు సాచింది.

నీళ్లుకమ్మిన కళ్లను నులుముకొని నిదానంగా ఆ విగ్రహాన్ని పరిశీలించి చూచాడు. అరుణ కదూ? అవును ఆమే. చింతనిప్పుల్లా ఉన్న కళ్ళను మరింత పెద్దవిచేసి చూచాడు, అనుమాన నివృత్తికోసం. తెంచిన పూవుల్ని తల్లో తరుముకుంటో వెళ్లిం దక్కడనుంచి, ఆ క్షణప్రభ.

సుందర్రావు ఎదలో మెదలిన సౌదామిని నిండిన కాళరోచుల్లో కరగిపోయింది. అతని హృదయంలో కృష్ణకాంతులు విజృంభించాయి.

చచ్చి మరే లోకంలో ఆలపిస్తున్నాడో శ్రీరామమూర్తి చెప్పిన మాటలు అక్షరాలా నిజం. "ఆడదాన్ని నమ్మి నీవు గాడిదవు కాబోకు నరుడా" అని గొణిగాడు సుందర్రావు.

రెండు కిటికీ ఊచల్ని రెండుచేతుల్తో పట్టుకొని ఆమె వెళ్లిన దిక్కుగా చూస్తోన్నాడు.

అత నెన్నోమాట్లు భావించాడు, తానున్న గది ఒక బందిఖానా అనీ తానొక జన్మఖైదీ అని. అసలు లోకమంతా కిటికీ అవతల ఆమెతోడిదే అని. అనుకోటమేమిటి, ఓమాటు రాయనుకూడా రాశాడు.

అత నలానే చూస్తోన్నాడు. ఎవ్వరూలేని ఎడారిలోంచి అతని చూపులు పరిక్రమించి శూన్యంలో పయనిస్తున్నయ్. అత నీ లోకంలో లేడు.

అతనిప్పుడు సంచరించే లోకంలో సుఖమూ సంతోషమూ లేవు. అది నిరాశామయము. అది శోకపూర్ణము.

ఆ లోకంలో మానవులూ, జంతువులూ, స్థావరాలూ, కొండలూ, నదులూ, ఉన్నాయో లేవో మనకు తెలీదు. బహుశా దాని నిర్మాత సుందర్రావుకే తెలీదేమో.

* * *

కళ్ళద్దాలు సవరిస్తూ వచ్చింది బయటకు హెడ్ మిస్ట్రెస్. పైపంటితో కింది పెదవిని సన్నగా నొక్కుతో నాలుగువేపులా చూసింది. ఆమె వదనంలో తల్లి కళ్లల్లోకి చూస్తూ బోసి నోటి నవ్వు మొలకల్ని ఒలకబోసే పసిపాప నేత్రాల్లోని హాసరోచిస్సు, నైర్మల్యము, నైగనిగ్యము ఉన్నాయి. ఐతే ఆమె గాంభీర్యం తెచ్చి పెట్టుకున్నట్లుగా కనిపిస్తుంది. బహుశా గంభీరంగా ఉండాలని ఆమెవాంఛ గాబోలు.

తోటలోకి దారి తీసిందామె.

తోటమాలి సుబ్బన్న వెంబడినడుస్తో నిన్నటికీ, ఈ రోజుకూ కలిగిన మార్పుల్ని వినిపిస్తున్నాడు.

సుందర్రావ్ నిశ్చలంగా నుంచొనివున్నాడు. అతనామెను చూడలేదు. ఆమె అతన్ని చూడలేదు. చిక్కుడు చెట్టు మీదుగా దాసాని చెట్టు దగ్గరకువచ్చింది. పుష్పరహితయై, అలంకార హీనయైన నగ్న సుందరి మాదిరివుంది.

ప్రార్థనకు గంట కొట్టారు. ఆమె తోట లోంచి బయటకు నడిచింది.

అట్టహాసంగా నవ్వుతో, ప్రేలుతో ఆనందానికి ఆకారాలు కల్పించినట్లు ఒక్కొక్కరు వస్తోన్నారు ప్రార్థనకు. కిటికీ కమ్మల నానుకొని భీభత్సంగా ఉన్న సుందర్రావ్‌ని వేలెట్టి చూపి, నవ్వింది ఓ అమ్మాయి. తోటివాళ్లు పల్లవి పలికారని హెడ్ మిస్ట్రెస్ కింప పెదవి పై పంటితో నొక్కి కళ్ళింత పెద్దవి చేసి చూచిందా పిల్లవేపు.

ప్రార్థనైంది.

సుందర్రావ్ నిశ్చలంగా ఉన్నాడు, సమాధిలో.

అతన్ని చూస్తో వెళ్ళారు ఒక్కొక్కరూ, ప్రార్థన నుంచి. హెడ్ మిస్ట్రెస్ అరుణవేపు చూచింది. నేల చూస్తో నడుస్తుంది అరుణ.

సుందర్రావ్ ఇంకా నుంచోనున్నాడు.

"పదకొండైంది గంట, ఆఫీసుకు పోవూ?" అనే శబ్దం వంట యింటిలోంచి బయలుదేరి సుందర్రావు గదిలోకి ప్రవేశించింది. ఆఫీసు అనే మాట పాశమైబంధించి అతనున్న మరో లోకంలోంచి ఈలోకంలోకి లాక్కువచ్చింది. తానెక్కడున్నాడు? ప్రార్థనైందా? గంట చూచుకున్నాడు. 11-2. ఆల్ రైట్ రాసిన జాబు బయటికితీశాడు. ముక్కలు చేసి గాల్లోకి ఊదాడు.

వాళ్ళమ్మ అతనున్న గదిలోకి వచ్చి "అన్నం పెట్టాను తిందువుగాని రా" అంది.

రాత్రి రాసిన ఫైళ్లు చంకన ఇరికించుకొని బయల్దేరాడు ఆఫీసుకు.

అతని చెవుల్లో "అన్నం పెట్టాను తిందువుగానిరా" అని వినిపిస్తోంది. అతని రక్తంలో "కామినీ హృదయ కావ్యరస పరిగ్రహణంబు నారికేళ పాకము గదా!" అని ధ్వనిస్తోంది.

అతను ఆఫీసుకు వెళ్లాడు.

# వార్తా ప్రసారం

కొప్పర్తి వెంకటేశ్వరశర్మ

ఆవిడ భార్య. ఆయన భర్త. వాళ్లిద్దరూ ప్రేమించుకొని పెళ్ళిచేసుకున్నారో బలవంతానచేయబడ్డారో తెలుసుకుందామని మీకెంతో కుతూహలంగా ఉండొచ్చు. క్షమించండి. ఆ విషయం తెలుసుకునే అదృష్టం నాకు కూడా కలుగలేదు, నాకు తెలిసిందల్లా వాళ్లు ఎనిమిది సంవత్సరాలనుంచి కలిసి ఒకచోట కాపురం చేస్తున్నారని మాత్రమే.

ఒకరోజు ఒక ముసలమ్మ వాళ్ళకు సంబంధించిన ఒక రహస్యాన్ని ఇంటింటికీపోయి రహస్యంగా ప్రసారం చేస్తున్నది. అది నా చెవిని కూడాపడింది. దాన్ని మీచెవిని పోస్తున్నాను.

"చూశారటమ్మా! ఆ శంకరయ్య పెళ్లాం సీతారాం లేదూ, మొగుడి పెట్టిలోంచి ఐదు రూపాయలు దొంగతాళంచెవి పెట్టి తీసిందట!"

"ఎంత సిగ్గులేనిదమ్మా" అని అంతా ముక్కుమీద వేళ్లు వేసుకున్నారు, ఆ అమ్మాయి వాసన తమకు తగలకుండా గాబోలు.

నేనూ సీతారాంని చిన్నప్పటినించీ ఎరుగుదును. ఆ అమ్మాయికిప్పుడు పాతికేళ్లు. మేమిద్దరం కలిసి ఆడుకునే వాళ్ళం చిన్నతనంలో. "కొంచెం కొంచెం ప్రేమ గూడానా?..." అని మీరడగొచ్చు. ఆహా, అక్షరాలా. కొంచెం ఏం ఖర్మ. హృదయం అంతటితోటీ. వీలయితే మీరుగూడా ప్రేమించండి నిరభ్యంతరంగా.

ఆ ముసలమ్మకు యిప్పుడే తెలిసిందిగాని నాకు చిన్నప్పుడే తెలుసు సీతారాం ఎంత దొంగదైందీ. ఆ విషయానికొస్తే నేను గూడ దొంగవాణ్ణేనంటుంది సీతారాం. మీరు ఆమెనుపోయి కనుక్కోవచ్చు. అది తేల్చుకున్న తర్వాత మీరు తెలుసుకోవలసిన విషయం మేమిద్దరమూ కలిసి దొంగతనాలు చేసే వాళ్ళమని.

ఆచార్లగారి దొడ్లో దానిమ్మకాయలూ, ప్రభలవారబ్బాయి సుద్ద ముక్కలూ,